ప్రజాశక్తి

మంగళవారం 10 జూన్ 2025

5

అనంతపురం

షైనింగ్ స్టార్స్ మెగా చెక్కును విద్యార్థినికి అందిస్తున్న కలెక్టర్ వినోద్‌కుమార్

స్ఫూర్తిదాయకంగా 'షైనింగ్ స్టార్స్'

◆ కలెక్టర్ వినోద్‌కుమార్, ఎమ్మెల్యే పరిటాల సునీత

◆ 184 మంది విద్యార్థులకు షైనింగ్ స్టార్స్ అవార్డు

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

చదువులో అత్యంత ప్రతిభ చాటి ప్రభుత్వం అందించిన షైనింగ్‌స్టార్స్ అవార్డు అందుకున్న విద్యార్థులను మిగిలిన విద్యార్థులు స్ఫూర్తిదాయకంగా తీసుకోవాలని కలెక్టర్ డా॥వి.వినోద్‌కుమార్ తెలిపారు. పదోతరగతి, ఇంటర్మీడియట్‌లో అత్యుత్తమ మార్కులతో ఫలితాలను సాధించిన విద్యార్థులకు అనంతపురం నగరంలోని జిఆర్.ఫంక్షన్ హాల్‌లో షైనింగ్ స్టార్స్ – 2025 పంపిణీ కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. ఈ కార్యక్రమం కింద 184 మంది 10వ తరగతి, 35 మంది ఇంటర్ విద్యార్థులు ఒక్కొక్కరికి ఒక మెడల్, సర్టిఫికెట్, రూ.20 వేల నగదు పురస్కారాన్ని అందించారు. ఈ కార్యక్రమంలో రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత, విద్యాశాఖ అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ షైనింగ్ స్టార్స్ అవార్డు పంపిణీ కార్యక్రమం విద్యార్థులు అందరికీ స్ఫూర్తిదాయకంగా నిలవాలన్నారు. విద్యార్థుల్లో చదువుపై ఆశక్తిని మరింత పెంచేందుకు ప్రభుత్వం ఇలాంటి కార్యక్రమాలను నిర్వహిస్తోందన్నారు. వాస్తవికత, సజనాత్మకత మేళవింపుతో విద్యార్థులు వారు రంగంలో రాణిస్తారో గుర్తించి అందులో ముందుకు సాగాలన్నారు. భవిష్యత్తులో గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షలకు సంబంధించి టీచర్లను పెట్టి శిక్షణ కార్యక్రమం ఏర్పాటు చేసే ప్రయత్నం చేస్తామన్నారు. ఎమ్మెల్యే పరిటాల సునీత మాట్లాడుతూ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు విద్యాభివృద్ధికి విశేష సహకారం అందిస్తున్నారని చెప్పారు. గతంలో ఎన్నడూ లేని విధంగా షైనింగ్ స్టార్స్ కార్యక్రమం ఏర్పాటు చేసి విద్యార్థులను ప్రోత్సహిస్తున్నట్లు తెలియజేశారు. విద్యార్థులు సెల్‌ఫోన్‌లకు దూరంగా ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో నాయీ బ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ కొండన్న, వాల్మీకి కార్పొరేషన్ డైరెక్టర్ కెఎల్ఎన్.మూర్తి, కురుబ సంఘం డైరెక్టర్ కాటమయ్య, రజక కార్పొరేషన్ డైరెక్టర్ పరమేశ్వర్, ఆర్డీవో కేశవనాయుడు, డీఈవో ప్రసాద్ బాబు, డివిఇఒ వెంకటరమణ నాయక్, సమగ్ర శిక్ష ఎపిసి శైలజ తదితరులు పాల్గొన్నారు.

అకృత్యాలపై నిరసనాగ్రహం

◆ సిపిఎం ఆధ్వర్యంలో రాస్తారోకో

◆ ఎస్పీ కార్యాలయం వద్ద వైసిపి నిరసన

◆ నేడు ఐద్వా ఆధ్వర్యంలో రౌండ్‌టేబుల్ సమావేశం

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి, అనంతపురం కలెక్టరేట్

మహిళలు, విద్యార్థినులు, బాలికలపై ఉమ్మడి జిల్లాలో జరుగుతున్న అత్యాచారాలు, హత్యలను నిరసిస్తూ పార్టీలు, ప్రజాసంఘాల ఆధ్వర్యంలో నిరసనాగ్రహం వ్యక్తం అయ్యింది. అనంతపురం రామకృష్ణ కాలనీకి చెందిన గిరిజన ఇంటర్ విద్యార్థిని తన్మయి హత్య, శ్రీ సత్యసాయి జిల్లా రామగిరిలో దళిత విద్యార్థినిపై అత్యాచార ఘటనలో నిందితులను శిక్షించాలని, ఇందులో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న పోలీసులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ సిపిఎం ఆధ్వర్యంలో సోమవారం సాయంత్రం అనంతపురం టవర్‌క్లాక్ సర్కిల్‌లో రాస్తారోకో నిర్వహించారు. తన్మయి హత్య కేసులో నిందితులను శిక్షించాలని కోరుతూ వైసిపి ఆధ్వర్యంలో అనంతపురం ఎస్పీ కార్యాలయం వద్ద వైసిపి ఆధ్వర్యంలో ఆందోళన చేపట్టారు. రామగిరి ఘటనలో నిందితులు ఎవరినీ వదలకుండా చర్యలు తీసుకోవాలని కోరుతూ వైసిపి నాయకులు శ్రీ సత్యసాయి జిల్లా ఎస్పీ వి.రత్నను కలిసి వినతిపత్రం అందజేశారు.

అనంతపురం టవర్‌క్లాక్ వద్ద నిరసన తెలుపుతున్న సిపిఎం, ప్రజాసంఘాల నాయకులు

సిపిఎం రాస్తారోకో

అనంతపురం కలెక్టరేట్ : గిరిజన ఇంటర్ విద్యార్థిని తన్మయి హత్య, శ్రీ సత్యసాయి జిల్లా రామగిరిలో దళిత విద్యార్థినిపై అత్యాచార ఘటనలో నిందితులను శిక్షించాలని, ఇందులో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న పోలీసులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ సిపిఎం ఆధ్వర్యంలో సోమవారం సాయంత్రం అనంతపురం టవర్‌క్లాక్ సర్కిల్‌లో రాస్తారోకో నిర్వహించారు. జాతీయ రహదారిపై సిపిఎం నాయకులు, కార్యకర్తలు బైటాయించి పెద్ద ఎత్తున ఆందోళన నిర్వహించారు. ఈ సమయంలో పోలీసులు వారిని వారించి రాస్తారోకో విరమించాలని కోరారు. బాలికలు, విద్యార్థినులపై అత్యాచారాలు, హత్యలు జరుగుతుంటే పోలీసులు ఏం చేస్తున్నారంటూ సిపిఎం నాయకులు ప్రశ్నించారు. ఈ సందర్భంగా సిపిఎం అనంతపురం నగర కార్యదర్శి వి.రామిరెడ్డి మాట్లాడుతూ ఉమ్మడి జిల్లాలో వరుసగా విద్యార్థినులపై జరిగిన ఘటనలు కలిచి వేస్తున్నాయని చెప్పారు. రామగిరి మండలంలో మైనర్ దళిత బాలికను దుండగులు బెదిరించి, వీడియోలు చిత్రించి 6 నెలలుగా 14 మంది అత్యాచారం చేశారన్నారు. ఇది మరవకముందే అనంతపురం సమీపంలోని రామక్రిష్ణ కాలనీకి చెందిన ఇంటర్మీడియట్ విద్యార్థిని తన్మయిని ప్రేమ పేరుతో అటవీ ప్రాంతానికి తీసుకెళ్లి అతి కిరాతకంగా హత్య చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. తమ కూతురు కన్పించడం లేదంటూ విద్యార్థిని తల్లిదండ్రులు 1వ పట్టణ పోలీస్ స్టేషన్‌లో ఈ నెల 3వ తేదీ ఫిర్యాదు చేసినా పోలీసులు సరిగా స్పందించలేదన్నారు. పోలీసులు విచారించకుండా నిర్లక్ష్యం చేయడం వల్లే విద్యార్థిని హత్యకు గురైందన్నారు. రామగిరి ఘటనలోనూ పోలీసులు నిర్లక్ష్యంగా వ్యవహరించారని తెలిపారు. దళిత, గిరిజన విద్యార్థినులు, మహిళలపై వరుస ఘటనలు జరుగుతుంటే కూటమి ప్రభుత్వం మొద్దు నిద్ర వహస్తున్నట్లు ఉందన్నారు. రామగిరిలో మహిళా ఎమ్మెల్యే, ఆ జిల్లాలో మహిళా మంత్రి, మహిళా ఎస్పీ ఉన్నా మైనర్ బాలికకు న్యాయం జరగని దుస్థితి నెలకొందన్నారు. తన్మయి ఘటనలో స్థానిక ఎమ్మెల్యే రూ.లక్ష ఇచ్చి సరిపెట్టినట్లు ఉందన్నారు. అమ్మాయి మానం, ప్రాణం రూ.లక్షతో వెలకట్టలేమన్నారు. నిందితులను శిక్షించేలా ఎమ్మెల్యేలు, మంత్రులు చర్యలు తీసుకోవాలన్నారు. నిందితుల్లో ఏ రాజకీయ పార్టీ వారు ఉన్నా ఉపేక్షించకూడదని డిమాండ్ చేశారు. తన్మయి హత్య నిందితులను, మైనర్ బాలికను అత్యాచారం చేసిన నిందితులను కఠినంగా శిక్షించాలన్నారు. లేని పక్షంలో పోలీసు కార్యాలయ వద్ద ఆందోళనలు చేపడతమన్నారు. ఆందోళన విషయం తెలుసుకున్న సిఐ వెంకటేష్ నాయక్ సిపిఎం నాయకులతో మాట్లాడారు. నిందితులను పట్టుకుని శిక్షిస్తామని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా నాయకులు చంద్రశేఖర్‌రెడ్డి, వలి, ప్రకాష్, మసూద్, ఇర్ఫాన్, మన్నీల రామాంజినేయులు, సిఐటియు నగర అధ్యక్షులు వెంకటనారాయణ, కెవిపిఎస్ జిల్లా అధ్యక్షులు వెంకటేష్, మున్సిపల్ వర్కర్స్ యూనియన్ లక్ష్మి నరసమ్మ, ఎస్ఎఫ్ఐ జిల్లా ప్రధాన కార్యదర్శి ఓతురు పరమేష్ పాల్గొన్నారు.

నేడు రౌండ్ టేబుల్ సమావేశం

ఉమ్మడి జిల్లాలో మహిళలపై పెరుగుతున్న అఘాయిత్యాలు, హత్యలను నియంత్రించాలని కోరుతూ మంగళవారం నాడు ఐద్వా ఆధ్వర్యంలో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహిస్తున్నట్లు ఆ సంఘం రాష్ట్ర కోశాధికారి వి.సావిత్రి తెలిపారు. మంగళవారం సాయంత్రం 5 గంటలకు అనంతపురం ఎన్జీవో హోంలో ఐద్వా ఆధ్వర్యంలో రౌండ్ టేబుల్ సమావేశం జరుగుతుందన్నారు. మేధావులు, కవులు, విద్యార్థులు, మహిళలు, ప్రజా సంఘాల నాయకులు ఇందులో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

నిందితులను శిక్షించాలి : ఐద్వా

ఇంటర్ విద్యార్థి తన్మయి హత్యకు కారణమైన నిందితులను కఠినంగా శిక్షించాలని ఐద్వా నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం స్థానిక గణేనాయక్ భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఐద్వా రాష్ట్ర కోశాధికారి వి.సావిత్రి మాట్లాడుతూ జిల్లాలో వరుసగా హత్యలు, అత్యాచార సంఘటనలో జరుగుతుండడం తీవ్ర ఆందోళన కలిగించే అంశం అన్నారు. మహిళల ప్రాణాలకు రక్షణ కల్పిస్తామని అధికారంలోకి వచ్చిన టిడిపి కూటమి ప్రభుత్వం ఉమ్మడి జిల్లాలో జరుగుతున్న సంఘటనలపై స్పందించి చర్యలు తీసుకోవాల్సి ఉందన్నారు. శ్రీసత్యసాయి జిల్లా చిలమత్తూరు ప్రాంతంలో అత్తా కోడళ్లపై గ్యాంగ్ రేప్ మొదలుకుని రామగిరిలో మైనర్ బాలిక, కూడేరు ప్రాంతంలో విద్యార్థి దారుణహత్య ఘటనలు సభ్య సమాజం తలదించుకునేలా ఉన్నాయన్నారు. పేదరికంలో ఉన్న హరిజన, గిరిజన కుటుంబాల మహిళలను లక్ష్యంగా చేసుకుని కొందరు వారిపై ఘోరాలకు తెగబడుతున్నారన్నారు. మద్యం, గంజాయికి అలవాటు పడిన యువత ఈ కిరాతక చర్యలకు పాల్పడుతోందన్నారు. ఘటనలు జరిగిన వెంటనే పోలీసులు సకాలంలో స్పందించకపోవడంతో నిందితులు మరింత రెచ్చిపోతున్నారని తెలిపారు. ఇలాంటి నేరాలకు కారణమవుతున్న వారిని వెంటనే అరెస్టు చేసి, నిష్పక్షపాతంగా వ్యవహరించి శిక్షలు పడేలా చూడాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఐద్వా జిల్లా అధ్యక్షులు శ్యామల, నగర నాయకులు చంద్రిక, అశ్విని తదితరులు పాల్గొన్నారు.

ఎస్పీ కార్యాలయం వద్ద నిరసన తెలుపుతున్న వైసిపి నాయకులు

ఎస్పీ కార్యాలయం ఎదుట వైసిపి నిరసన

అనంతపురం జిల్లాలో ఇంటర్ చదివే విద్యార్థిని తన్మయిని హత్య చేసిన నిందితుడిని కఠినంగా శిక్షించాలని కోరుతూ వైసిపి నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు విద్యార్థిని కుటుంబ సభ్యులతో కలిసి అనంతపురం ఎస్పీ కార్యాలయం ఎదుట వైసిపి నాయకులు ఆందోళన చేపట్టారు. అంబేద్కర్ విగ్రహం నుంచి ఎస్పీ కార్యాలయం వరకు ప్రదర్శనగా వెళ్లి నిరసన తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడి అనంతపురం జిల్లా పరిషత్ ఛైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ, నగర మేయరు వసీం, డిప్యూటీ మేయరు వాసంతి తదితర నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా బోయ గిరిజమ్మ మాట్లాడుతూ మహిళలకు భద్రతను కల్పిస్తామని ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, హోం మంత్రి అనిత చెబుతున్నా ఆచరణలో వాటి అమలు ఏ మాత్రం లేదన్నారు. రాష్ట్రంలో వరుసగా మహిళలపై అఘాయిత్యాలు జరుగుతూనే ఉన్నాయని విమర్శించారు. మహిళలకు రక్షణ కల్పించడంలో ఈ ప్రభుత్వం విఫలం చెందిందని దుయ్యబట్టారు. ఇప్పటికైనా ప్రభుత్వం బాధితులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. తన్మయి కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వాలని డిమాండ్ చేశారు.

కనుంపల్లిలో 'తమ్ముళ్ల' ఘర్షణ

ఏడుగురికి గాయాలు - ఆసుపత్రులకు తరలింపు

ప్రజాశక్తి-అనంతపురం

శింగనమల నియోజక వర్గం గార్లదిన్నె మండలం కనుంపల్లి గ్రామంలో తెలుగుదేశం నేతల మధ్య ఘర్షణ చోటు చేసుకుంది. ఆ పార్టీలో గత కొంతకాలంగా రెండు గ్రూపుల మధ్య వివాదం నడుస్తోంది. ఈ నేపథ్యంలో సోమవారం ఉదయం రెండు గ్రూపుల మధ్య చెలరేగిన వివాదం తారా స్థాయికి చేరింది. పరస్పరం రాళ్ళు, కర్రలతో దాడులు చేసుకున్నారు. ఈ ఘటనలో ఏడుగురు గాయపడ్డారు. గాయపడ్డ వారందరినీ 108 వాహనంలో అనంతపురం సర్వజన ఆసుపత్రికి తరలించారు.

ఘర్షణ పడుతున్న టిడిపి మద్దతుదారులు

రెండు గ్రూపుల మధ్య వివాదం

తెలుగుదేశం పార్టీ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి గార్లదిన్నె మండలం కనుంపల్లి గ్రామంలో రెండు గ్రూపులు ఏర్పడ్డాయి. రెండు గ్రూపుల మధ్య పచ్చగడ్డి వేస్తే భగ్గుమనే విధంగా ఉంటూ వస్తోంది. ప్రసాద్ అనే వ్యక్తి ఈ విషయంలో ఇటీవల జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి టిజి.భరత్‌కి ప్రత్యర్థి గ్రూపుపై ఫిర్యాదు చేశాడు. ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ తమకు కాకుండా మరొకరికి ప్రాధాన్యతనిస్తున్నారని ప్రసాద్ ఆరోపించాడు. ఈ ఆరోపణల నేపథ్యంలోనే ప్రసాద్ ఇటీవల గ్రామంలో జరిగిన కొన్ని అవినీతి అక్రమాలపై ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసినట్టు సమాచారం. సోమవారం కూడా ఇదే రకంగా ఫిర్యాదు చేయడానికి వెళ్లేందుకు ప్రసాద్ సిద్ధమయ్యాడని తెలిసి మరో గ్రూపు ఘర్షణకు దిగింది. ఈ తరుణంలో రెండు గ్రూపుల మధ్య పరస్పరం రాళ్ల దాడులు చోటు చేసుకున్నాయి. ఈ దాడిలో ప్రసాద్‌తోపాటు ఆయన మద్దతుగా వచ్చిన వెంకటలక్ష్మి, ప్రసాద్‌లు గాయపడ్డారు. మరో గ్రూపుకి చెందిన సంతోష్, నల్లమ్మ, రాము, ఇందుజలు గాయపడ్డారు. గాయపడిన వారిని 108 ఆసుపత్రికి తరలించారు. ఈ ఘటనపై ఇరు వర్గాల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు విచారిస్తున్నారు.

జిందాల్ ఫ్యాక్టరీ వద్ద గంజాయి అమ్మకం..!

ప్రజాశక్తి-బొమ్మనహాల్

మండల పరిధిలోని జిందాల్ ఐరన్ ఫ్యాక్టరీ సమీపంలో యథేచ్ఛగా గంజాయి విక్రయాలు సాగుతున్నట్లు విమర్శలు ఉన్నాయి. కొందరు వ్యాపారులు చాపకింద నీరులా యువకులకు గంజాయిని విక్రయిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. ఈ విషయమై రాయదుర్గం సిఐ రూరల్ వెంకటరమణను వివరణ కోరగా ఆ ప్రాంతం మా పరిధిలోకి రాదు మాకు తెలియదని దాటవేత సమాధానం చెప్పారు. కాగా ఇప్పటికే ఓ వ్యక్తిని అదుపులోకి తీసుకొని ఆ తర్వాత వదిలేసినట్లు విమర్శలు ఉన్నాయి. ఇకనైనా పోలీసు ఉన్నతాధికారులు స్పందించి గంజాయి విక్రయాలను పూర్తిగా అరికట్టాలని ప్రజలు కోరుతున్నారు.

ప్రిన్సిపల్ బాధ్యతల స్వీకరణ

ప్రజాశక్తి-రాయదుర్గం రూరల్

పట్టణంలోని కెటిఎస్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఎఫ్ఎసి ప్రిన్సిపల్‌గా లక్ష్మీనారాయణ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో పనిచేసిన ప్రిన్సిపల్ రఘురామ్మూర్తి గత నెల 31వ తేదీ ఉద్యోగ విరమణ పొందారు. ఆ స్థానంలో సీనియర్ అధ్యాపకులు లక్ష్మీనారాయణ ప్రిన్సిపల్‌గా బాధ్యతలు స్వీకరించారు. ఆయన మాట్లాడుతూ కళాశాల అభివృద్ధికి కృషి చేస్తానని తెలిపారు.

7న గ్రామాల్లో దండోరా జెండా ఎగరేయాలి

ప్రజాశక్తి-కళ్యాణదుర్గం టౌన్

జులై 7వ తేదీ ప్రతి గ్రామంలో దండోరా జెండా ఎగరవేయాలని ఎంఆర్‌పిఎస్, ఎంఎస్‌పి జిల్లా ఇన్‌ఛార్జి చిన్న సుబ్బరావు పిలుపునిచ్చారు. పట్టణంలోని ఆర్అండ్‌బి అతిథి గృహంలో సోమవారం ఎంఆర్‌పిఎస్, ఎంఎస్‌పి నాయకులతో సమావేశం నిర్వహించారు. మందకృష్ణ మాదిగ ఆదేశాల మేరకు జులై 7వ తేదీ గ్రామగ్రామాన ఎంఆర్‌పిఎస్ 31వ వార్షికోత్సవం నిర్వహించాలన్నారు. ప్రతి గ్రామంలో చదువుకున్న యువకులతో ఎంఆర్‌పిఎస్, ఎంఎస్‌పిల నూతన కమిటీలు ఏర్పాటు చేయాలన్నారు. సమావేశంలో ఎంఆర్‌పిఎస్ జిల్లా అధ్యక్షులు హరిగోపాల్, ఎంఎస్‌పి జిల్లా అధ్యక్షులు కదిరప్ప, నాయకులు గోవిందప్ప, నాగరాజు, తిమ్మరాజులు, ఆంజనేయులు, మైలారి, గోపాల్, వన్నూర్‌స్వామి, ప్రసాద్, రాయుడు, తదితరులు పాల్గొన్నారు.

దళిత, గిరిజనులకు రక్షణ కరువు

ఆర్డీవోకు వినతిపత్రం అందిస్తున్న ఎస్సీ, ఎస్టీ, ప్రజాసంఘాల నాయకులు

ప్రజాశక్తి-కళ్యాణదుర్గం టౌన్

రాష్ట్రంలో దళిత, గిరిజన బాలికలకు రక్షణ లేదని ఎస్సీ, ఎస్టీ, ప్రజా సంఘాల నాయకులు ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో భాగంగా సోమవారం ఆర్డీఓ వసంతబాబుకు ఆయా సంఘాల నాయకులు చెలిమప్ప, లాయర్ ఆంజనేయులు, నాగరాజు, చంద్ర, తదితరులు వినతి పత్రం అందజేశారు. కూటమి ప్రభుత్వంలో దళిత, గిరిజనులపై దాడులు, అత్యాచా రాలు జరుగుతున్నా అరికట్టడంలో పాలకులు విఫలమయ్యారని వాపోయారు. అనంతపురం నగరానికి చెందిన విద్యార్థిని తన్మయి కనబడటం లేదని తల్లిదండ్రులు ఫిర్యాదు చేసిన వెంటనే పోలీసులు స్పందించి వుంటే ఆ బాలిక బతికేదన్నారు. రామగిరి మండలం ఏడుగుర్రాలపల్లిలో దళిత బాలికపై అత్యాచార సంఘటనను మరువకముందే తన్మయి హత్యకు గురికావడం బాధాకరమన్నారు.

ఇంజినీరింగ్ కార్మికుల సమ్మె నోటీసు

సమ్మె నోటీసు అందిస్తున్న మున్సిపల్ కార్మికులు

ప్రజాశక్తి-అనంతపురం కార్పొరేషన్

మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని సిఐటియు మున్సిపల్ యూనియన్ రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా మున్సిపల్ కమిషనర్‌కు సోమవారం సమ్మె నోటీసు అందజేశారు. ఈ సందర్భంగా మున్సిపల్ ఉద్యోగ కార్మిక సంఘం సిఐటియు నాయకులు మాట్లాడుతూ ఇంజినీరింగ్ కార్మికుల జీతాల పెంపుతోపాటు షరతులు లేకుండా సంక్షేమ పథకాలు అమలు చేయాలన్నారు. రిటైర్‌మెంట్ బెనిఫిట్ రూ.75000, ఎక్స్‌గ్రేషియా రూ.7లక్షలకు పెంచాలని, దహన సంస్కారాలకు రూ.15వేల నుంచి 20 వేలకు పెంచాలని, వయోపరిమితి 62 ఏళ్లకు పెంచాలన్నారు. అలాగే ఆప్కాస్ ద్వారా రిటైర్‌మెంట్ చేసినా, అనారోగ్యం పాలైనా, చనిపోయినా వారి స్థానంలో బిడ్డలకు ఉద్యోగాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. సుప్రీంకోర్టు తీర్పు మేరకు సమానపనికి సమాన వేతనం, గ్రాట్యుటీ చెల్లించాలని, చట్టబద్ధమైన సెలవులు అమలు చేయాలని కోరారు. వీటితోపాటు అనేక సమస్యలు పరిష్కరించాలని కోరుతూ సమ్మె నోటీసు అందజేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నగర కార్యదర్శి ముత్తుజా, మున్సిపల్ ఇంజినీరింగ్ యూనియన్ గౌరవాధ్యక్షులు గోపాల్, మున్సిపల్ యూనియన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు, ఎటిఎం నాగరాజు, కె.నాగభూషణ, ఇంజినీరింగ్ విభాగం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు మల్లికార్జున, సంజీవరాయుడు, నగర అధ్యక్ష, కార్యదర్శులు, ఓబుళపతి, మురళి, కోశాధికారి పోతులయ్య, ఐఎఫ్‌టియు నాయకులు సురేష్ పాల్గొన్నారు.

'కూటమి' పాలనలో శాంతిభద్రతలు నిర్వీర్యం

వైసిపి జిల్లా అధ్యక్షుడు అనంత వెంకటరామిరెడ్డి

ప్రజాశక్తి-అనంతపురం

రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి పోలీస్ వ్యవస్థ నిర్వీర్యమై శాంతిభద్రతలు క్షీణించాయని వైసిపి జిల్లా అధ్యక్షులు అనంత వెంకటరామిరెడ్డి మండిపడ్డారు. సోమవారం నగరంలోని వైసిపి జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ బీహార్‌లోని ఛంబల్ లోయ కంటే దారుణంగా ఎపిలో పరిస్థితులు ఉన్నాయన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక శ్రీసత్యసాయి జిల్లా హిందూపురం మండలంలో కుటుంబ సభ్యుల సమక్షంలో గ్యాంప్ రేప్ జరగడం బాధాకరమన్నారు. అలాగే ఇటీవల రామగిరి మండలంలో 9వ తరగతి చదువుతున్న దళిత బాలికపై సామూహిక అత్యాచారం చేశారని, చివరకు బాధిత కుటుంబ సభ్యులు ఫిర్యాదు కూడా చేయలేని దారుణ పరిస్థితులు వచ్చాయన్నారు. తాజాగా అనంతపురంలోని రామకృష్ణకాలనీకి చెందిన ఇంటర్ విద్యార్థిని తన్మయి హత్యకు గురికావడం బాధాకరమన్నారు. ఈనెల 3వ తేదీన తన్మయి అదృశ్యమైతే కుటుంబ సభ్యులు వన్‌టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశారని, చివరకు ఐదు రోజుల తర్వాత విద్యార్థిని శవమై కనిపించిందన్నారు. ఫిర్యాదు అందిన వెంటనే పోలీసులు అప్రమత్తంగా వ్యవహరించి గాలింపు చర్యలు చేపట్టి ఉంటే ఇలాంటి పరిస్థితి వచ్చేది కాదని తెలిపారు. ఒక్క అనంతపురం జిల్లాలోనే ఏకంగా 72 మహిళల మిస్సింగ్ కేసులు ఉన్నాయన్నారు. చాలా కేసుల్లో ఫిర్యాదులు తీసుకుని రిజిస్టర్ చేయడానికి కూడా పోలీసులు వెనుకంజ వేస్తున్నారని తెలిపారు.

విలేకరులతో మాట్లాడుతున్న అనంత వెంకటరామిరెడ్డి

లింగ నిర్ధారణ పరీక్షలు చేస్తే చర్యలు

ప్రజాశక్తి-కళ్యాణదుర్గం టౌన్

ఎక్కడైనా లింగ నిర్ధారణ పరీక్షలు చేస్తే కఠిన చర్యలు తప్పవని ఆర్డీవో వసంతబాబు హెచ్చరిం చారు. గర్భస్థ పిండ లింగనిర్ధారణ నిషేధిత చట్టం అమలుపై సోమవారం స్థానిక ఆర్డీవో కార్యాలయంలో వైద్యశాఖ ప్రోగ్రామ్ ఆఫీసర్ రాజేష్‌కుమార్, పట్టణ సిఐ యువరాజు, ప్రభుత్వ, ఆర్డీటీ డాక్టర్లు, సిడిపిఒ ప్రసన్నలతో డివిజినల్ స్థాయి సమావేశం నిర్వహించారు. ఆర్డీవో మాట్లాడుతూ గర్భస్థ పిండ లింగ నిర్ధారణ విషయంలో అందరూ కఠినంగా వ్యవహరించాలని ఆదేశించారు. ఎక్కడైనా అనుమతి పొందిన స్కానింగ్ సెంటర్లు, అనుమతి లేని సెంటర్లలో ఇలాంటి నిర్ధారణ పరీక్షలు చేస్తున్నట్లు తెలిస్తే వారిపై చర్యలు తీసుకోవాలన్నారు. ఆడపిల్లను గర్భంలోనే చిదిమేసే ప్రక్రియ ఏమాత్రం మంచిది కాదన్నారు. దీనిపై క్షేత్రస్థాయిలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సంబంధిత శాఖ అధికారులకు సూచించారు. సమావేశంలో ఆర్డీటీ గైనకాలజిస్ట్ భవిష్య, ఆరోగ్య విద్యాబోధన అధికారి డాక్టర్ లక్ష్మినారాయణ, పలు ప్రయివేట్ ఆసుపత్రుల వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ఇంటింటి చెత్త సేకరణపై రూట్‌మ్యాప్

ప్రజాశక్తి-అనంతపురం కార్పొరేషన్

నగరంలో ఇంటింటి చెత్త సేకరణ చేపట్టడనికి ప్రతి సచివాలయ పరిధిలో గృహాలు వీధులను గూగుల్ మ్యాప్ ద్వారా రూట్ మ్యాప్ తయారు చేసి చెత్త సేకరణ చేపట్టాలని కమిషనర్ బాలస్వామి నగరంలోని సచివాలయ సిబ్బందికి ఆదేశాలు జారీ చేశారు. అలాగే తయారు చేసిన రూట్ మ్యాప్‌ను ప్రజలకు తెలిసేలా సచివాలయాలలో రూట్ మ్యాప్ ను ల్యామినేషన్ చేసిన షీట్‌ను ప్రదర్శించాలన్నారు. అంతేగాకుండా సమగ్రమైన ఆడియోలో ప్రతి చెత్త సేకరణ వాహనానికి బిగించి నిరంతరం ప్రజలకు వినిపించేలా చెత్త సేకరణ సమయంలో చేయాలన్నారు. ఏదైనా లోపం తలెత్తితే అధికారుల దృష్టికి తీసుకురావాలని కోరారు.

పిడుగుపాటుకు నలుగురు విద్యార్థులకు అస్వస్థత

హిందూపురం : శ్రీ సత్య సాయి జిల్లా హిందూపురం పట్టణంలో సోమవారం సాయంత్రం ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షం కురిసింది. పట్టణంలోని మోతుకుపల్లి సమీపంలో టెంకాయ చెట్టుపై పిడుగు పడటంతో చెట్టు సమీపంలో ఆడుకుంటున్న నలుగురు విద్యార్థులు అస్వస్థతకు గురయ్యారు. వెంటనే జిల్లా ప్రభుత్వ ఆసుపత్రికి వారిని తీసుకుని వచ్చి వైద్య సేవలను అందించారు. మోతుకుపల్లికి చెందిన రాకేష్, వంశీ, తరుణ్, ప్రణీత్ లు కలిసి ఆడుకుంటున్నారు. ఒక్కసారిగా ఉరుములు, మెరుపులు రావడంతో పాటు పిడుగు పడింది. దీనివల్ల వారికి తీవ్ర గాయాలు అయినాయి. ఈ విషయం తెలిసిన వెంటనే బంధువులు వారిని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

పార్టీలకతీతంగా సిఎం సహాయ నిధి సాయం

ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం

ప్రజాశక్తి-గుంతకల్లు

కూటమి ప్రభుత్వం పాలనలో రాజకీయ పార్టీలకు అతీతంగా సిఎం సహాయ నిధి నుంచి నిధులు మంజూరు చేస్తున్నామని ఎమ్మెల్యే గుమ్మనూరు జయరామ్ తెలిపారు. సోమవారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో 15వ విడత సిఎం రిలీఫ్ ఫండ్ కింద మంజూరైన రూ.10.17 లక్షల చెక్కులను లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలోని ఎంతో మంది నిరుపేదలు అనారోగ్యంతో బాధపడుతూ చికిత్స కోసం డబ్బులు లేక అప్పులు చేసుకుని చికిత్స తీసుకుని అనంతరం తన వద్దకు వచ్చి సీఎం రిలీఫ్ ఫండ్ కింద దరఖాస్తు చేసుకున్నారని తెలిపారు. వారికి అండగా నిలబడుతూ రాజకీయ పార్టీలకు అతీతంగా ప్రతి ఒక్కరికీ న్యాయం చేస్తున్నామని తెలిపారు. ప్రజల సంక్షేమమే కూటమి ప్రభుత్వం లక్ష్యమన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి ఇన్‌ఛార్జి గుమ్మనూరు నారాయణస్వామి, కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

'ఉపాధి' బిల్లులు విడుదల చేయాలి : సిపిఎం

ప్రజాశక్తి-పుట్లూరు

పెండింగ్‌లో ఉన్న గ్రామీణ ఉపాధి హామీ బిల్లులను వెంటనే చెల్లించాలని ఎపి వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు ఎస్.సూరి డిమాండ్ చేశారు. ఈమేరకు సోమవారం మండల కేంద్రంలోని ఎంపిడిఒ కార్యాలయంలో ఎపిఒ నరేంద్రకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వారంవారం ఉపాధి బిల్లులు చెల్లించకపోవడంతో కూలీలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. చాలామంది కూలీలకు పూట గడవడం లేదన్నారు. కావున వెంటనే పెండింగ్ బిల్లులు చెల్లించడంతోపాటు క్రమం తప్పకుండా బిల్లులు చెల్లించాలని కోరారు. అలాగే ఏడాదికి 200 రోజులు పని కల్పించి, రోజు కూలి రూ.600 ఇవ్వాలని, పనిముట్లు అందజేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం మండల కార్యదర్శి టి.పెద్దయ్య, కెవిపిఎస్ నాగభూషణ్, నాయకులు బి.భాస్కర్‌రెడ్డి, వెంకటచౌదరి, కుళ్లాయప్ప, ఆర్.రాఘవరెడ్డి, పెద్దయ్య, నారాయణప్ప, కంబగిరి, రామచంద్రారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



వినతిపత్రం అందజేస్తున్న సిపిఎం నాయకులు

ప్రజాశక్తి
www.prajasakti.com

యోగాతో ఒత్తిడి ఉపశమనం

యోగాంధ్ర ర్యాలీల్లో వక్తలు

ప్రజాశక్తి-అనంతపురం

యోగా చేయడం ద్వారా ప్రతి ఒక్కరూ ఒత్తిడితో ఉపశమనం లభిస్తుందని మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.మాణిక్యరావు, యోగాంధ్ర నోడల్ ఆఫీసర్ జిల్లా వైద్య శాఖ అధికారి డాక్టర్ ఇబి దేవి సూచించారు. యోగాంధ్ర కార్యక్రమంలో భాగంగా మెడికల్ కళాశాల ఆడిటోరియం ఆవరణలో మెడికల్ కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో ప్రభుత్వ మెడికల్ కళాశాల, ప్రభుత్వ సర్వజన వైద్యశాల, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ, వివేకానంద యోగా కేంద్రం, జిల్లా ఆయుష్ శాఖ సంయుక్త ఆధ్వర్యంలో యోగాసనాలు వేశారు. ఈ కార్యక్రమంలో యోగా గురువులు ఎర్రంశెట్టి ఆంజనేయులు, డాక్టర్ రిచారెడ్డి, హౌస్‌సర్జన్ డాక్టర్ యశ్వంతి రాయల్, ఆసుపత్రి అడ్మినిస్ట్రేటర్ మల్లికార్జునరెడ్డి, సహాయ ఆర్ఎంఒలు పద్మజ, హేమలత, సీనియర్ ప్రొఫెసర్లు ఆత్మరామ్, కెఎల్ సుబ్రమణ్యం, మనోరంజన్‌రెడ్డి, ఉమామహేశ్వరరావు, వివేకానంద యోగా కేంద్ర అధ్యక్షులు రాజశేఖర్‌రెడ్డి, ఆయుష్ లాల్యానాయక్, మెడికల్ కళాశాల ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ ఆదిరెడ్డి పరదేశీనాయుడు, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ సిబ్బంది యుగంధర్, త్యాగరాజు, తదితరులు పాల్గొన్నారు.

పెద్దపప్పూరు : మండల కేంద్రంలో యోగాపై సోమవారం మండల కేంద్రంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఇఒఆర్‌డి సురేష్‌బాబు, మహిళా సంఘాల అధికారులు, పంచాయతీ సెక్రెటరీ మహేశ్వర్‌రెడ్డి, జిల్లా ఉపాధి హామీ సిబ్బంది, అంగన్వాడీ కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

బెలుగుప్ప : యోగాసనాలు చేయడం ద్వారా ఒత్తిడిని దూరం చేసుకోవచ్చని ఎంపిపి జిల్లా అధ్యక్షుడు పెద్దన్న, టిడిపి జిల్లా కార్యదర్శి బి.మల్లికార్జున అన్నారు. సోమవారం మండల కేంద్రంలో యోగాంధ్ర ర్యాలీ నిర్వహించారు. అనంతరం టి.సర్కిల్‌లో మానవహారంగా ఏర్పడి ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ అనిల్‌కుమార్, ఎంపిడిఒ టి.లక్ష్మీనారాయణ, డాక్టర్ కార్తీక్‌కుమార్‌రెడ్డి, డిప్యూటీ ఎంపిడిఒ శివరంజని, ఎపిఎం సురేష్, పంచాయతీ కార్యదర్శి శివరంజని, తదితరులు పాల్గొన్నారు.

శింగనమల : మండల కేంద్రంలోని ఆత్మా రామాలయం నుంచి అంబేద్కర్ విగ్రహం వరకూ ఎంపిడిఒ భాస్కర్ ఆధ్వర్యంలో సోమవారం యోగాంధ్ర ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నాయీ బ్రాహ్మణ రాష్ట్ర డైరెక్టర్ ఎం.ఆదినారాయణ, నాయకులు కాయల రమణయాదవ్, ఉపాధి హామీ, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

పుట్లూరు : మండల వ్యాప్తంగా యోగాంధ్ర ర్యాలీలు నిర్వహించారు. ఇందులో భాగంగా సర్పంచులు, సచివాలయం సిబ్బంది యోగాసనాలు వేశారు.

పామిడి : ఎంపిడిఒ తేజోష్న, తహశీల్దార్ శ్రీధర్‌మూర్తి ఆధ్వర్యంలో సోమవారం మండల కేంద్రంలో యోగాంధ్ర ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఎద్దులపల్లి రోడ్డులోని అంబేద్కర్ సర్కిల్లో మానవహారంగా ఏర్పడి ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో మండలంలోని అధికారులు, ఎన్‌డిఎ నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

నార్పల : మండల కేంద్రంలోని పంచాయతీ కార్యాలయం నుంచి గాంధీ సర్కిల్ వరకూ ఎంపిడిఒ మమతాదేవి ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ మన్నీల సుప్రియ, ఇఒఆర్‌డి శైలజారాణి, ఎపిఎం తిప్పమ్మ, పంచాయతీ కార్యదర్శులు శ్యామల, పరశురాం, శ్రీనివాసులు, సచివాలయ సిబ్బంది, సత్యసాయి ఆశ్రమం పిల్లలు, తదితరులు పాల్గొన్నారు.

కళ్యాణదుర్గం టౌన్ : ఆరోగ్య ప్రదాయినిగా భావిస్తున్న యోగాంధ్రపై ప్రజల్లో విస్తృతంగా చైతన్యం తీసుకురావాలని ఆర్డీవో వసంతబాబు పిలుపునిచ్చారు. మున్సిపల్ కమిషనర్ వంశీకృష్ణభార్గవ్, వివిధ శాఖల అధికారులు, స్థానిక ప్రజా ప్రతినిధులు, నాయకులు, ప్రజలతో కలిసి సోమవారం మున్సిపాలిటీ పరిధిలోని పలు వార్డుల్లో ర్యాలీ నిర్వహించారు. యోగా వల్ల కలిగే ప్రయోజనాలు, ఆరోగ్యం గురించి వివరిస్తూ ముందుకు సాగారు. ప్రతిఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని, ఆరోగ్యాంధ్రప్రదేశ్ లక్ష్యంతో ముందు కెళ్లాలన్నారు. యోగా చేయడం వల్ల ఒత్తిళ్లకు లోనైన వారు వాటి నుంచి బయట పడవచ్చున్నారు.

మెడికల్ కళాశాల ఆవరణలో యోగా చేస్తున్న అధికారులు, వైద్యులు

పామిడిలో మానవహారం ఏర్పాటు చేసిన అధికారులు

యోగాపై కూరగాయల వ్యాపారికి అవగాహన కల్పిస్తున్న కలెక్టర్ వినోద్‌కుమార్

యోగాపై అవగాహన ఉండాలి

ఇంటింటికీ వెళ్లి వివరించిన కలెక్టర్

ప్రజాశక్తి-అనంతపురం కార్పొరేషన్

యోగాపై ప్రతి ఒక్కరికీ అవగాహన ఉండాలని కలెక్టర్ వినోద్‌కుమార్.వి సూచించారు. సోమవారం అనంతపురంలోని 65వ వార్డు సచివాలయం పరిధిలో యోగాంధ్ర ర్యాలీ నిర్వహించారు. ర్యాలీలో పాల్గొన్న కలెక్టర్ ఇంటింటికీ వెళ్లి యోగాపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఈనెల 21న జరిగే అంతర్జాతీయ యోగా దినోత్సవంలో ప్రజలందరూ పాల్గొనాలని సూచించారు. ప్రతిఒక్కరూ యోగా చేయాలన్నారు. యోగా చేయడం వల్ల సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని, యోగాంధ్ర కార్యక్రమాల్లో ప్రతిఒక్కరూ పాల్గొనాలన్నారు. జిల్లాలోని ప్రతి గ్రామస్థాయిలో, వార్డు స్థాయిలో, హాబిటేషన్ స్థాయిలో, అన్ని నివాస ప్రాంతాల్లో ర్యాలీలు నిర్వహించినట్లు తెలిపారు.

రాయదుర్గం : పురపాలక సంఘం ఆధ్వర్యంలో పట్టణంలోని సచివాలయాల పరిధిలో యోగాంధ్ర ర్యాలీలు, సదస్సులు నిర్వహించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ దివాకర్‌రెడ్డి, మేనేజర్ కిషోర్, మెప్మా టిఎంసి నారాయణరెడ్డి, కౌన్సిలర్ జ్యోతి, నాయకులు హనుమంతు, ధనార్జున, పార్వతి, బాషా, రవి, జలంధర్, రాజశేఖర్, రఘు, సచివాలయ ఉద్యోగులు, మెప్మా ఆర్పీలు, మహిళా సంఘ సభ్యులు పాల్గొన్నారు.

బొమ్మనహాళ్ : యోగాంధ్రలో భాగంగా స్థానిక మండల రెవెన్యూ కార్యాలయం నుంచి పోలీస్ స్టేషన్ మీదుగా వినాయక సర్కిల్ వరకూ ప్రభుత్వ ప్రయివేట్ ఉద్యోగులు, యువకులు యోగాపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. స్థానిక పోలీస్‌స్టేషన్ సర్కిల్‌లో తహశీల్దార్ మునివేలు మాట్లాడుతూ యోగా, వాకింగ్, చిన్నచిన్న ఎక్సర్‌సైజులు చేయడం వల్ల ఎలాంటి రోగాలు దరి చేరవని ఆరోగ్యంగా ఉండవచ్చన్నారు. దీర్ఘకాలిక రోగాలు నియంత్రణలోకి వస్తాయన్నారు. ర్యాలీలో ఎంపీడీవో విజయభాస్కర్, ప్రజాప్రతినిధులు, వైద్య, వెలుగు, పోలీస్ సిబ్బంది, ఆశా వర్కర్లు ప్రజలు పాల్గొన్నారు

మహిళలు, బాలికలకు రక్షణ కరువు

ఉరవకొండ : రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక మహిళలు, బాలికలకు రక్షణ లేకుండా పోయిందని శాసనమండలి ప్రివిలేజ్ కమిటీ ఛైర్మన్, ఎమ్మెల్సీ వై.శివరామిరెడ్డి సోమవారం ఒక ప్రకటనలో విమర్శించారు. అనంతపురంలో ఇంటర్ చదువుతున్న గిరిజన బాలిక సాకే తన్మయి కనిపించడం లేదని తల్లిదండ్రులు ఫిర్యాదు చేసినా, రక్షించడంలో ప్రభుత్వం విఫలమైందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఘటనకు ముఖ్యమంత్రి, రాష్ట్ర ప్రభుత్వం బాధ్యత వహించాలన్నారు.

లింగనిర్ధారణ పరీక్షలు చేస్తే చర్యలు

ఉరవకొండ : ఎవరైనా లింగ నిర్ధారణ పరీక్షలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని డిప్యూటీ హెల్త్ ఎడ్యుకేషన్ ఆఫీసర్ షఫీ హెచ్చరించారు. సోమవారం మండల పరిధిలోని రాకెట్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్యాధికారి వెంకటేష్‌నాయక్ ఆధ్వర్యంలో గర్భస్థ లింగనిర్ధార పరీక్షలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొంతమంది గర్భస్థ లింగనిర్ధారణ కోసం స్కానింగ్ చేసి కడుపులో ఉంది ఆడ శిశువు అని నిర్ధారణ చేసుకుని భ్రూణహత్యలకు పాల్పడుతున్నారన్నారు. ఇది చట్టవ్యతిరేకమైన చర్య అన్నారు. భ్రూణహత్యలను ప్రోత్సాహించినా, నిర్వహించినా శిక్ష, జరిమానా తప్పదని హెచ్చరించారు. అలాగే కొంతమంది తమ పిల్లలకు సరైన వివాహ వయస్సు రాగానే బాల్య వివాహాలు చేస్తున్నారని, అమ్మాయికి 18, అబ్బాయికి 21 ఏళ్లు నిండిన తర్వాతనే వివాహాలు చేయాలన్నారు. లేకుంటే బాల్యవివాహాల నిరోధక చట్టం ప్రకారం శిక్ష, జరిమానా విధిస్తారని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో హెల్త్ సూపరవైజర్ శేఖర్, వైద్య సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

సబ్సిడీ వేరుశనగ విత్తనాలు పంపిణీ

రాప్తాడు : మండలంలోని బొమ్మేపర్తి వ్యవసాయ శాఖ కార్యాలయంలో సోమవారం సబ్సిడీ వేరుశనగ విత్తనాలను పంపిణీని ప్రారంభించారు. ఈ సందర్భంగా తెలుగు యువత మండల అధ్యక్షులు రాజశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ సిఎం చంద్రబాబుతోనే రైతుల అభ్యున్నతి సాధ్యమవుతుందన్నారు. 40శాతం శాతం సబ్సిడీతో వేరుశనగ విత్తనాలు పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు కావున రైతులందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రెసిడెంట్ అశ్వర్థప్ప, నాగిరెడ్డి, ఉజ్జినప్ప, ఆంజనేయులు, రేణుకమ్మ, ఎంపిఇఒ రాధ, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఉద్యోగాలకు 61 మంది ఎంపిక

నియామకపత్రాలను అందుకుంటున్న విద్యార్థులు

అనంతపురం సిటీ : నగరంలోని ప్రభుత్వ బాలుర ఐటిఐలో సోమవారం నిర్వహించిన జాబ్‌మేళాలో 61 మంది ఉద్యోగాలకు ఎంపికయ్యారు. బెంగళూరుకు చెందిన ఎల్ఎంఎస్ కార్పోరేట్ సర్వీసెస్ సంస్థ, అన్వనల్ ఎఫ్‌సిఐ, అభ్యుదయ సేఫ్టీ, సెక్యూరిటీ సొల్యూషన్స్ ప్రయివేట్ లిమిటెడ్ సంస్థలు పాల్గొని 61 మంది ఉద్యోగాలకు ఎంపిక చేసుకున్నారు. ఎంపికైన విద్యార్థులు జూలైలో జరిగే పరీక్షల అనంతరం వారు వెళ్లి కంపెనీలలో ఉద్యోగాల్లో చేరిపోతారు. ఎంపికై ఉద్యోగాల్లో చేరే వారికి నెలకు రూ.19వేల వేతనం చెల్లిస్తామని కంపెనీ ప్రతినిధులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ రామ్మూర్తి, ఐటిఐ ప్రిన్సిపాళ్లు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

'విద్యా విధానం, సవాళ్ల'పై ఉపాధ్యాయులకు శిక్షణ

ప్రజాశక్తి-అనంతపురం

పట్టణంలోని ఎల్ఆర్‌జి పాఠశాలలో ప్రిన్సిపల్ రెవరెండ్ ఫాదర్ బొంతు ప్రసాద్ ఆధ్వర్యంలో సోమవారం ఆధునిక ప్రపంచంలో విద్యా విధానం, సవాళ్లపై ఉపాధ్యాయులకు శిక్షణ ఇచ్చారు. ఇందులో భాగంగా ఇంగ్లీషు, మ్యాథ్స్, సైన్స్‌లో నిష్ణాతులైన ఫాతిమా కళాశాల అధ్యాపకులు తెలుగు చిన్నప్ప, ఎంజెపి సంఘం జూనియర్ కళాశాల అసిస్టెంట్ ప్రిన్సిపాల్ కె.అశోక్ హాజరై ఆధునిక ప్రపంచంలో విద్యను ఏవిధంగా బోధించాలో, భవిష్యత్తులో ఎదుర్కోవాల్సిన సవాళ్లపై కూలంకషంగా వివరించడంతోపాటు సూచనలు, సలహాలు అందజేశారు. ముందుగా పాఠశాలకు కరస్పాండెంట్‌గా నూతనంగా విచ్చేసిన రెవ ఫాదర్ కొంగా శేఖర్‌కు ఘన స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో ఎల్ఆర్‌జి పాఠశాల యాజమాన్యం, సిబ్బంది పాల్గొన్నారు.

ముఖ్య అతిథులను సత్కరిస్తున్న ఎల్ఆర్‌జి పాఠశాల ప్రిన్సిపాల్ ఫాదర్ బొందు ప్రసాద్

'వికసిత కృషి సంకల్ప అభియాన్'

ప్రజాశక్తి-అనంతపురం

అనంతపురం రూరల్ మండలం ఎ.నారాయణపురం తాటిచెర్ల గ్రామాల్లో సోమవారం రెడ్డిపల్లి కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్తల బృందం వికసిత కృషి సంకల్ప అభియాన్ కార్యక్రమం నిర్వహించింది. ఇందులో భాగంగా హైదరాబాద్ భారతీయ నూనె గింజల పరిశోదన కేంద్రం కీటక శాస్త్రవేత్త పి.దురై మురగన్ వేరుశనగ, ఆముదం, కంది, శనగ, బత్తాయి పంటలు, వాటిని ఆశించే చీడపీడలు, సస్యరక్షణ, నీటి యాజమాన్యంపై వివరించారు. రెడ్డిపల్లి కెవికె లైవ్‌స్టాక్ శాస్త్రవేత్త మాధవి కెవికె అందిస్తున్న సేవలు, విత్తనాల లభ్యత, డ్రోన్ ద్వారా పిచికారి, గొర్రెలు, మేకలు పశుపోషణ, వ్యాధులు నివారణ చర్యలు గురించి తదితర అంశాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ శారద, మండల వ్యవసాయ అధికారిణి జె.శశికళ, వ్యవసాయ విస్తరణ అధికారి బి.మురళీకృష్ణ, ఆర్ఎస్‌కె సిబ్బంది లోకేశ్వరి, రాజేశ్వరి, జయచంద్రారెడ్డి, వెటర్నరీ అసిస్టెంట్లు, జడ్‌బిఎన్ఎఫ్ సిబ్బంది ఉమాశంకర్, ఓబుళపతి, చంద్రాయుడు, ప్రియాంక, సంజీవరెడ్డి, ముత్యాలప్ప, రామమోహన్, సుశీలమ్మ, వన్నూరుస్వామి, రమ్య, తదితరులు పాల్గొన్నారు.

కార్యక్రమంలో మాట్లాడుతున్న శాస్త్రవేత్తలు

ఆదర్శ పాఠశాలలో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

యల్లనూరు : మండల పరిధిలోని చిలమకూరు ఆదర్శ పాఠశాలలో 6 నుంచి 9వ తరగతి వరకూ మిగులు ప్రవేశాలకు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకోవాలని మండల విద్యాశాఖ అధికారులు పాఠశాల ప్రిన్సిపాల్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇంటర్ మొదటి సంవత్సరం ఎంపిసి, బైపిసి, ఎంఇసి, సిఇసి గ్రూపుల్లో మిగులు సీట్ల కోసం ఈనెల 20వతేదీ వరకూ ఆన్‌లైన్‌లో ఫీజు చెల్లించి దరఖాస్తు చేసుకోవాలన్నారు.

గ్యాంగ్‌రేప్ చేసిన వారిని ఉరితీయాలి

పెద్దపప్పూరు : సత్యసాయి జిల్లా రామగిరి మండలంలో 14ఏళ్ల బాలికపై సామూహిక అత్యాచారం చేసిన వారిని ఉరితీయాలని ఎంఆర్‌పిఎస్ నాయకులు ఆదినారాయణ డిమాండ్ చేశారు. ఈమేరకు సోమవారం మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్‌లో ఎస్ఐకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తండ్రి లేని దళిత బాలికపై ఏకంగా 14 మంది అత్యాచారం చేయడంతోపాటు వీడియో తీసి వైరల్ చేయడం బాధాకరమన్నారు. వెంటనే నిందితులను శిక్షించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంఆర్‌పిఎస్ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

కెఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో అన్నదానం

శింగనమల : మండల పరిధిలోని తరిమెల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో కెఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో సోమవారం అన్నదానం చేశారు. ప్రధానమంత్రి సురక్ష మాతృ అభియాన్ కార్యక్రమంలో భాగంగా తరిమెల వైద్యాధికారి డాక్టర్ శంకర్ నాయక్ దాదాపు 74 మంది గర్భిణులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. వీరందరికీ కెఆర్ ఫౌండేషన్ కృష్ణారెడ్డి, కోటేశ్వర్‌రెడ్డి, మారుతి, హరి, చెన్నయ్య, కుమార్, రమేష్, పిహెచ్ఎన్ గ్రేసీ లలిత, సూపర్‌వైజర్ నాగమ్మ, ల్యాబ్ టెక్నీషియన్ తిప్పేస్వామి, ఆరోగ్య కార్యకర్తలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

అన్నదానం చేస్తున్న దృశ్యం

గొర్రెల పెంపకంతో అధిక లాభాలు

మందులు అందజేస్తున్న వైద్యులు, విర్‌బ్యాక్ ప్రతినిధులు

బెలుగుప్ప : శాస్త్రీయ యాజమాన్య పద్ధతులతో గొర్రెల పెంపకం ద్వారా అధిక లాభాలు సాధించవచ్చని పశు వైద్యాధికారి డాక్టర్ రమేష్ సూచించారు. సోమవారం మండల పరిధిలోని నరసాపురం గ్రామంలో సోమవారం విర్ బ్యాక్ కంపెనీ వారి సహకారంతో చూడు గొర్రెల సీమంతం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఐదు చూడు గొర్రెలు ఎంపిక చేసుకుని రెండు నెలలపాటు నట్టల నివారణ మందులు, గ్రో ఫ్లెక్స్ బ్రోట టానిక్‌లను అందజేశారు. ఈ కార్యక్రమంలో విర్ బ్యాక్ కంపెనీ ప్రతినిధి తిరుపాల్‌రెడ్డి, గొర్రెల కాపరులు, తదితరులు పాల్గొన్నారు.

ప్రతిభావంత విద్యార్థులకు షైనింగ్ స్టార్ అవార్డుల ప్రదానం

ప్రజాశక్తి-అనంతపురం

ఇంటర్ ద్వితీయ సంవత్సరం ఫలితాల్లో అత్యధిక మార్కులు సాధించిన నలంద కళాశాలకు చెందిన విద్యార్థులు ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ఇస్తున్న షైనింగ్ స్టార్స్ పురస్కారాలను అందుకున్నట్లు ప్రిన్సిపాళ్లు ఖాజీబాబు, వినోద్‌కుమార్ తెలిపారు. ఈమేరకు సోమవారం అనంతపురంలో జరిగిన ఓ కార్యక్రమంలో నలంద కళాశాలకు చెందిన విద్యార్థులు బి.శబరీనాథ్, డి.ఫర్జానా, ఎస్.రాజేశ్వరి పురస్కారంతోపాటు రూ.20వేల నగదు అందుకున్నట్లు తెలిపారు.

కళ్యాణదుర్గం రూరల్ : పట్టణంలోని శ్రీలక్ష్మీ వెంకటేశ్వర విద్యాలయం(ఎస్ఎల్‌వి) విద్యార్థిని ఎం.లిఖిత షైనింగ్ స్టార్ అవార్డు అందుకుంది. అనంతపురం నగరంలోని జిఆర్ గార్డెన్ ఫంక్షన్ హాలులో సోమవారం నిర్వహించిన 'షైనింగ్ స్టార్స్' అవార్డు ప్రదానోత్సవ కార్యక్రమంలో ఎం.లిఖిత కలెక్టర్ డాక్టర్ వి.వినోద్‌కుమార్, ఎమ్మెల్యే పరిటాల సునీత నుంచి రూ.20వేల ప్రోత్సాహక బహుమతి, సర్టిఫికెట్, మెడల్ అందుకుంది. లిఖిత మాట్లాడుతూ ఐదేళ్లుగా ఎస్ఎల్‌వి పాఠశాల యాజమాన్యం తనకు ఉచిత విద్యతో పాటు పుస్తకాలు, యూనిఫామ్ అందించి ప్రోత్సహించిందని కృతజ్ఞతలు తెలిపారు.

రాయదుర్గం : డి.హీరేహాల్ మండలంలోని బాల మేధావి ఇంగ్లీషు మీడియం హైస్కూల్ విద్యార్థులు బి.జ్యేష్ఠ, కెబి.చంద్రశేఖర్‌రెడ్డి ఎమ్మెల్యే పరిటాల సునీత, కలెక్టర్ డాక్టర్ వి.వినోద్‌కుమార్ నుంచి షైనింగ్ స్టార్స్ అవార్డు అందుకున్నారు. వారు రూ. 20వేల చెక్కు, ప్రశంసాపత్రం, మెడల్ అందుకున్నారు. విద్యాశాఖ గుత్తి ఉప విద్యాధికారి మల్లారెడ్డి మాట్లాడుతూ ఈ విద్యార్థులు ఉన్నత శిఖరాలను అధిరోహించి తల్లిదండ్రులు, పాఠశాలకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు.

బ్రహ్మసముద్రం : మండలంలోని పిల్లలపల్లి గ్రామ జడ్పీ హైస్కూల్ విద్యార్థిని చందన 'షైనింగ్ స్టార్' ప్రతిభా పురస్కారానికి ఎంపికైందని హెచ్ఎం అశోక్‌కుమార్, ఎంఇఒ ఓబుళపతి, ఎంపీడీవో నందకిషోర్ తెలిపారు. చందన అనంతపురంలో జరిగిన కార్యక్రమంలో కలెక్టర్ వినోద్ కుమార్, ఎమ్మెల్యే పరిటాల సునీత నుంచి రూ. 20వేల చెక్కు, ప్రశంసాపత్రం, మెడల్ అందుకుంది. చందనను ఎంఇఒలు ఓబుళపతి, కృష్ణానాయక్, హెచ్ఎంలు బసవరాజు, అశోక్ కుమార్, పాఠశాల ఉపాధ్యాయ బృందం అభినందించారు.

'ఎపి షైనింగ్ స్టార్స్' అందుకున్న నలంద విద్యార్థులు

కౌలు రైతుల సమస్యలు పరిష్కరించాలని వినతి

ప్రజాశక్తి-పామిడి

కౌలు రైతులు సమస్యలు పరిష్కరించాలని కోరుతూ సిపిఎం ఆధ్వర్యంలో సోమవారం స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో తహశీల్దార్ శ్రీధర్‌మూర్తికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎపి రైతు సంఘం మండల అధ్యక్షుడు చంద్రశేఖర్‌రెడ్డి, సిపిఎం మండల కార్యదర్శి మల్లేష్ మాట్లాడుతూ గజరాంపల్లి గ్రామంలో సర్వేనెంబర్ 296లో దాదాపుగా 20ఏళ్లుగా 19 మంది కౌలు రైతులు సాగు చేస్తున్నారన్నారు. వారందరికీ సిసిఆర్‌సి కార్డులు ఇవ్వాలని, అన్నదాత సుఖీభవ పథకం కింద రాష్ట్ర ప్రభుత్వం రూ.20వేలు చెల్లించాలని, 90 శాతం సబ్సిడీతో వేరుశనగ విత్తనకాయలు ఇవ్వాలని, పురుగు మందులు, విత్తనాలు, బ్యాంకు రుణాలు ఇవ్వాలన్నారు. ఆత్మహత్య చేసుకున్న కౌలు రైతు కుటుంబాలకు ఎలాంటి షరతులు లేకుండా గ్రామ పంచనామా ఆధారంగా రూ.10లక్షల పరిహారం ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎపి రైతుసంఘం మండల కార్యదర్శి ముత్యాలు, నారాయణ, వెంకటేశు, లాలెప్ప, శివలక్ష్మి, సుంకరత్నమ్మ, శంకరమ్మ, సురేంద్ర, మారన్న, చంద్ర, వరలక్ష్మి, జయమ్మ, తదితరులు పాల్గొన్నారు.

తహశీల్దార్ శ్రీధర్‌మూర్తికి వినతిపత్రం అందజేస్తున్న సిపిఎం నాయకులు, కౌలు రైతులు

ప్రజా సంక్షేమాన్ని గాలికొదిలేసిన ప్రభుత్వం

ఎంపిపి సుబ్బర హేమలత

ప్రజాశక్తి-ఆత్మకూరు

రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక దోచుకుని, దాచుకోవడంతోపాటు కమీషన్ల కోసం కొట్టుకుంటూ ప్రజాసంక్షేమాన్ని గాలికి వదిలేశారని ఎంపిపిల సంఘం ఉపాధ్యక్షురాలు సుబ్బర హేమలత ప్రశ్నించారు. సోమవారం మండల కేంద్రంలోని తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎంపిపి మాట్లాడుతూ ఉమ్మడి అనంతపురం జిల్లా పరిధిలో నాలుగు రోజుల వ్యవధిలోనే ఇద్దరు బాలికలపై అఘాయిత్యాలు జరిగితే కూటమి నాయకులు కనీసం బాధిత కుటుంబాలను పరామర్శించిన పాపాన పోలేదన్నారు. ఎంతసేపూ కమీషన్లు, కాదంటే డైవర్షన్ పాలిటిక్స్.. చేయడం తప్ప మహిళల రక్షణ చర్యలు తీసుకున్న పాపాన పోలేదన్నారు. ముఖ్యంగా ఇటీవల రామగిరి మండలం ఏడుగుర్రాలపల్లెకు చెందిన దళిత యువతిపై 14 మంది దుర్మార్గులు అత్యాచారానికి పాల్పడితే నిందితులను కఠినంగా శిక్షించాల్సింది పోయి దుర్మార్గులను వేనకేసుకు రావడం సిగ్గు చేటన్నారు. ఈ ఘటన మరువకముందే అనంతపురానికి చెందిన గిరిజన యువతిని అత్యంత కిరాతకంగా చంపేసి నగర శివార్లలో పడేయడం బాధాకరమన్నారు. వెంటనే కూటమి నాయకులు స్పందించి బాధితులకు న్యాయం చేయకపోతే వైసిపి తరపున ఆందోళనకు వెనుకాడబోమని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సర్పంచు ఎగ్గిడి వరలక్ష్మి, కురుబ కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ పార్వతమ్మ, శిరీషారెడ్డి, వన్నూరప్ప, తదితరులు పాల్గొన్నారు.

విలేకరులతో మాట్లాడుతున్న ఎంపిపి హేమలత

ఫార్మా.డి ఫలితాలను విడుదల చేస్తున్న జెఎన్‌టియు ప్రతినిధులు

జెఎన్‌టియు ఫార్మా.డి ఫలితాలు విడుదల

ప్రజాశక్తి-అనంతపురం

అనంతపురం జెఎన్‌టియు విశ్వవిద్యాలయం పరిధిలో గత మే నెలలో నిర్వహించిన ఫార్మా.డి 5వ సంవత్సరం (ఆర్.17) రెగ్యులర్, సప్లిమెంటరీ పరీక్షా ఫలితాలను సోమవారం విడుదల చేసినట్లు డైరెక్టర్ ఆఫ్ ఎవాల్యుయేషన్ వి.నాగప్రసాద్ నాయుడు, కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్ ఎపి శివకుమార్, అడిషనల్ కంట్రోలర్లు జి.శంకర్ శేఖర్‌రాజు, ఎస్.శ్రీధర్, ఎం.అంకారావు తెలిపారు. ఫలితాల కోసం జెఎన్‌టియు వెబ్‌సైట్ www.jntuaresults.inను సంప్రదించాలని కోరారు.

అంగన్వాడీలను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలి

ఉరవకొండ : అంగన్వాడీ కార్యకర్తలు, సహాయకులను శాశ్వత ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించి ఉద్యోగ భద్రత కల్పించాలని గిరిజన ఐక్య సాధన సమితి వ్యవస్థాపకులు మూడ్ కేశవనాయక్ సోమవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. అంగన్వాడీలతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వెట్టిచాకిరీ చేయించుకుంటున్నాయన్నారు. వెంటనే ప్రభుత్వ సర్వీసులోకి తీసుకుని, రెగ్యులరైజేషన్, ప్రయోజనాలు అందించడానికి, ఒక విధానం రూపొందించాలని కోరారు.

అనారోగ్యంతో అంగన్వాడీ కార్యకర్త మృతి

బెలుగుప్ప : కొద్దిరోజులుగా అనారోగ్యంతో బాధపడుతూ అంగన్వాడీ వర్కర్స్ లక్ష్మీదేవి (46) మృతిచెందిన ఘటన మండల పరిధిలోని రమినేపల్లి గ్రామంలో సోమవారం చోటు చేసుకుంది. విషయం తెలుసుకున్న సిడిపిఒ డాక్టర్ బి.ఎన్ శ్రీదేవి, ఐసిడిఎస్ సూపర్‌వైజర్ సురేఖ, అంగన్వాడీ యూనియన్ అధ్యక్షురాలు సత్యవతి, తదితరులు లక్ష్మీదేవి నివాసానికి చేరుకుని మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఐసిడిఎస్ ఉరవకొండ కార్యాలయం నుండి మట్టి ఖర్చులకు రూ.15వేలు అందజేశారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ వర్కర్స్ తదితరులు పాల్గొన్నారు

గూగూడులో ట్రాఫిక్ ఏర్పాట్లు పరిశీలన

నార్పల : మండల పరిధిలోని గూగూడు గ్రామంలో ఈనెల 27 నుంచి కుళ్లాయిస్వామి ఉత్సవాలు ప్రారంభం కానున్న నేపథ్యంలో డీఎస్పీ వెంకటేశ్వర్లు సోమవారం ట్రాఫిక్ ఏర్పాట్లను పరిశీలించారు. ఎక్కడా ట్రాఫిక్ సమస్య రాకుండా ఎలాంటి జాగ్రత్తలు పాటించాలో గ్రామస్తులు, పోలీసులతో చర్చించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ సాగర్, ఆలయ కార్యనిర్వాహణాధికారి సాకేతపురం శోభ, ఆలయ అర్చకులు హుసేనప్ప, గ్రామ పెద్దలు, తదితరులు పాల్గొన్నారు.

గ్రామస్తులు, పోలీసులతో మాట్లాడుతున్న డీఎస్పీ వెంకటేశ్వర్లు

నేరాలు ఘోరాలు

రైలు కింద పడి మహిళ ఆత్మహత్య

గుంతకల్లు : భవన నిర్మాణ కార్మికుడుగా పని చేస్తూ తాగుడుకు బానిసైన భర్త పనికి వెళ్లకుండా భార్య కూలీ డబ్బులు తీసుకుని తాగుతూ వేధిస్తుండటంతో తాళలేక రైలుకింద పడి మహిళ ఆత్మహత్య చేసుకున్న ఆదివారం రాత్రి గుంతకల్లులో చోటు చేసుకుంది. కుటుంబ సభ్యులు, రైల్వే పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. స్థానిక తిలక్‌నగర్ బిఎస్ఎస్ కాలనీ సమీపంలో నివాసం ఉంటున్న బోయ అనిత (30), భర్త బోయ సుధాకర్‌కు ఇద్దరు ఆడపిల్లలు, ఇద్దరు మగ పిల్లలు ఉన్నారు. సుధాకర్ బేల్దారి పని, అనిత ఇళ్లలో కూలి పనులు చేసుకుంటూ జీవనం సాగించేవారు. అయితే భర్త తాగుడుకు బానిసై పనికి వెళ్లకుండా భార్య కూలి చేసి సంపాదించిన డబ్బును తీసుకుని తాగేవాడు. దీంతో భార్యాభర్తల తరచూ గొడవలు జరిగేవి. ఈనేపథ్యంలో నలుగురు పిల్లలను ఎలా పోషించాలో అని అనిత రోజూ మధనపడుతూ ఉండేది. ఇందులో భాగంగానే ఆదివారం రాత్రి కూడా భర్త గొడవపడ్డాడు. జీవితంపై విరక్తి చెందిన అనిత సమీపంలోని సరస్వతి విద్యామందిరం ఎదురుగా ఉన్న రైల్వే బ్రిడ్జి మీద నుంచి రైలు కింద పడి ఆత్మహత్యకు పాల్పడింది. సమాచారం మేరకు జీఆర్పీ పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం స్థానిక ప్రభుత్వ ఏరియా ఆసుపత్రికి తరలించారు. మృతురాలి తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని జీఆర్పీ ఎస్ఐ మహేంద్ర తెలిపారు.

మృతిచెందిన అనిత

తల్లి, బిడ్డ కనిపించలేదని ఫిర్యాదు

కళ్యాణదుర్గం టౌన్ : మున్సిపాలిటీ పరిధిలోని కురాకులతోట గ్రామానికి చెందిన అపురూప, ఆమె కూతురు మూడేళ్ల లేహన్యశ్రీ కనిపించడం లేదని సోమవారం ఆమె సోదరుడు అనిల్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పట్టణ సిఐ యువరాజు తెలిపారు. ఈ నెల 6వ తేదీ మధ్యాహ్నం నుంచి అపురూప ఆమె కుమార్తె కనిపించడంలేదని, బంధువులు, ఇతర ప్రాంతాల్లో గాలించినా ఆచూకీ లభించలేదన్నారు. ఆచూకీ తెలిసిన వారు 7386400113, 9490106284కు సమాచారం ఇవ్వాలని సిఐ కోరారు.